క్లుప్తంగా

బోనాలకు ఏర్పాట్లు ముమ్మరం



కోటమైసమ్మ దేవాలయం వద్ద పరిసరాలను శుభ్రం చేయిస్తున్న అధికారులు

బడంగ్‌పేట్: ఆషాఢ మాసం సందర్భంగా నిర్వహించే బోనాల జాతరకు గాను ఆలయ నిర్వాహకులతో పాటు గ్రామస్తులు దేవాలయాలను అలంకరించడం, పలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్, అల్మాస్‌గూడ, బడంగ్‌పేట్ గ్రామాల్లో ఆదివారం బోనాల ఉత్సవాల సందర్భంగా కార్పొరేషన్ అధికారులు ఆలయాల పరిసరాలను శుభ్రం చేయిస్తున్నారు. గ్రామపెద్దలు అలంకరణతో పాటు రంగులు వేయించే పనిలో ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని లెనిన్‌నగర్ ఏఈ ఎస్.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ బడంగ్‌పేట ఫీడర్ పరిధిలోని భీష్మానగర్, షిర్డీ ఎన్‌క్లేవ్, గండారెడ్డికాలనీ, సాయిగోకుల్, సాయినగర్, రైతుబజార్, లెనిన్‌నగర్, హుడాకాలనీ, అన్నపూర్ణకాలనీ, బృందావన్‌కాలనీ, చింతలకుంట, లెనిన్‌నగర్ ఓల్డ్ విలేజ్‌లలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించాలని కోరారు.

కందుకూరుకు ఎమ్మెల్యే సబితారెడ్డి రాక నేడు

కందుకూరు: మండల పరిషత్ సమావేశ హాల్‌లో శుక్రవారం మహిళా సంఘాలతో నిర్వహించనున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరుకానున్నట్లు ఏపీఎం కవిత గురువారం తెలిపారు. మహిళా శక్తి సంబురాల్లో భాగంగా మహిళలకు వడ్డీలేని రుణాలు పంపిణీ చేయనున్నామన్నారు. ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మహిళా సంఘాలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఉత్సవాల నిర్వహణకు చెక్కుల అందజేత



ఆలయ నిర్వాహకులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

మీర్‌పేట: బోనాల ఉత్సవాల నిర్వహణకు ఆలయాలకు మంజూరైన చెక్కులను గురువారం మీర్‌పేట జిల్లెలగూడలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావుతో కలిసి ఎమ్మెల్యే సబితారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిధులు మంజూరు చేశారని, అదే ఆనవాయితీని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. ఆలయాలకు మరిన్ని నిధులు కేటాయించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. 47 ఆలయాలకు రూ.17 లక్షల 78 వేలు అందజేశారు. కార్యక్రమంలో టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఈఓలు శ్రీనివాస్‌రెడ్డి, మురళీకృష్ణ, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌రావు, మాజీ ధర్మకర్తలు యాదగిరిముదిరాజ్, జ్ఞానేశ్వర్, స్థానిక నాయకులు బొక్క రాజేందర్‌రెడ్డి, అనిల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

25 వరకు డిగ్రీ గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

కందుకూరు: మండలంలోని బైరాగిగూడ పరిధిలోని మహాత్మా జ్యోతిబాపులే బీసీ డిగ్రీ గురుకులంలో ఈ నెల 25వ తేదీవరకు అర్హతగల విద్యార్థులకు ప్రథమ సంవత్సరంలో చేరడానికి స్పాట్ అడ్మిషన్లు కల్పించనున్నట్లు బీసీ గురుకులం ప్రిన్సిపాల్ నాగభూషణాచారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ(ఎంపీసీఎస్, ఎంపీసీ, బీజెడ్‌సీ), బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్), బీఏ గ్రూపులలో ఖాళీలు ఉన్నాయన్నారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అన్ని ధ్రువపత్రాలతో డిగ్రీ కళాశాలలో జరిగే స్పాట్ కౌన్సిలింగ్‌కు హాజరుకావాలన్నారు. కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉచిత వసతులు, సబ్జెక్ట్, నోట్ పుస్తకాలు, అధునాతన ల్యాబరేటరీలు, కంప్యూటర్ ల్యాబ్, ఫిజికల్ ఎడ్యుకేషన్, పీజీ కోచింగ్, ఎంప్లాయబులిటీ స్కిల్స్ అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నేర్పించపడుతుందన్నారు.

నిధులిచ్చి మూడేళ్లైనా..



జిల్లెలగూడ సాయినగర్ శ్మశానవాటిక దుస్థితి

- అభివృద్ధికి నోచుకోని శ్మశానవాటికలు
- కనీస సౌకర్యాలు కరువు

మీర్‌పేట: ఆత్మీయుల ఆఖరి మజిలీలో బంధుమిత్రులకు కష్టాలు తప్పడం లేదు. కడసారి చూపుకోసం వచ్చిన వారికి వైకుంఠ ధామంలో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. అపరిశుభ్రత వాతావరణంతో పాటు.. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు దర్శనం ఇవ్వడంతో ఇబ్బంది పడుతున్నారు. శ్మశానవాటికల అభివృద్ధికి మూడేళ్ల క్రితం నాటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా.. ఆ దిశగా చర్యలు చేపట్టినవారు లేరు. అంత్యక్రియల అనంతరం కుటుంబీకుల స్నానాలు ఆరుబయటే ఆచరించడం గమనార్హం.

నగరానికి చేరువన ఉన్నా..

మీర్‌పేట మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధి లెనిన్‌నగర్, సిర్లాహిల్స్, సాయినగర్ శ్మశాన వాటికల అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.1 కోటి చొప్పున నిధులు మంజూరు చేసింది. ఇందులో ఒక్క సిర్లాహిల్స్ శ్మశాన వాటికలో సంబంధిత అధికారులు అరకొర పనులతో మమా అనిపించారన్న ఆరోపణలు ఉన్నాయి. మారుమూల గ్రామాల్లో సైతం వైకుంఠ ధామాల పేరిట శ్మశాన వాటికలు ఎంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దబడ్డాయని, కానీ మహానగరానికి చేరువన ఉన్న మీర్‌పేట శ్మశాన వాటికల దుస్థితి దయనీయంగా మారిందని పురపాలిక ప్రజలు పేర్కొంటున్నారు. అపరిశుభ్రతతో పాటు సౌకర్యాలు లేవని తెలిపారు. అంత్యక్రియల కోసం వచ్చే వారికి గదులు లేకపోవడంతో.. ఆరుబయటే స్నానాలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. జిల్లెలగూడ సాయినగర్ శ్మశాన వాటిక వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉందని, పరదాలు కట్టి స్నానాలు చేయాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి, శ్మశాన వాటికల్లో అభివృద్ధి పనులను త్వరగా చేపట్టాలని కోరుతున్నారు.



లెనిన్‌నగర్ వైకుంఠ ధామం ముఖద్వారం



మీర్‌పేట: అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న విద్యార్థినులు

వైభవం.. బోనాల సంబురం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో గురువారం బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు డప్పు చప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి మహంకాళి, పోచమ్మ, రేణుక ఎల్లమ్మ, ఎర్ర మైసమ్మ, కట్ట మైసమ్మ అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు.



బడంగ్‌పేట్: అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

పాఠశాలలో ఘనంగా..

మీర్‌పేట: మీర్‌పేట ఆర్ఎన్‌రెడ్డినగర్‌లోని ఓ పాఠశాలలో గురువారం బోనాల ఉత్సవాల ఘనంగా జరిగాయి. విద్యారినులు సాంప్రదాయ దుస్తుల్లో హాజరై అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. బోనాల విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు పోతురాజుల వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఫసల్ బీమాను అమలు చేయాలని వినతి



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

కందుకూరు: ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని కోరుతూ మండల పరిధిలోని నేదునూరు గ్రామ రైతులు మాజీ ఉపసర్పంచ్ గంగుల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్సార్ హయాంలో పంటల బీమా పథకం అమలులో ఉండటంతో అతివృష్టి, అనావృష్టి, వడగళ్ల వర్షం వంటి వాటితో పంటలు నష్టపోతే పరిహారం అందేదన్నారు. దీంతో దీమాగా వ్యవసాయం చేసుకునే వారమన్నారు. 2019లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజన పథకం నుంచి రాష్ట్ర ప్రభుత్వం వైదొలగడంతో నష్టపోతున్నామన్నారు. మళ్లీ ఫసల్ బీమా యోజన పథకాన్ని ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కో–ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, పీఏసీఎస్ డైరెక్టర్ సాధ పాండురంగారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉన్ని వెంకటయ్య, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గంగుల సురేందర్‌రెడ్డి, నాయకులు అంకగల్ల బాలయ్య, జగన్, గంగుల వెంకట్‌రెడ్డి, బుచ్చయ్య, మర్ల వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, రైతులు మత్యాస్ రెడ్డి, రాంరెడ్డి, చిన్నపురెడ్డి, పోశయ్య, యాదయ్య, జంగయ్య, సత్తయ్య, మల్లయ్య, శ్రీశైలం, రాములు, బాలకృష్ణ, భిక్షపతి, గోపాల్, రాంచంద్రయ్య, చెన్నయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవు



మలక్‌పేట: మద్యంమత్తులో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. గురువారం మలక్‌పేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నల్లగొండ క్రాస్, మలక్‌పేట, మూసారంబాగ్ మెట్రో స్టేషన్, తదితర ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను సౌత్‌ఈస్ట్ జోన్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామదాసు, మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో రాత్రిపూట మాత్రమే నిర్వహించే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ఇక నుంచి రోజంతా ఏ సమయంలోనైనా నిర్వహించనున్నట్లు తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

ఎమ్మెల్యే సబితారెడ్డి

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆలయ ఉత్సవాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు విషయాలపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడారు. శ్రావణ మాసంలో ఆలయ వార్షికోత్సవాలు (బోనాలు) ఏటా ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకు తగిన ఏర్పాట్లను అధికారులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా రావిర్యాల నుంచి ఆలయం వరకు రూ.4కోట్లతో బీటీ రోడ్డు, రూ.50 లక్షలతో సీసీరోడ్లు, రూ.30 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం , మంచి నీటి వసతి, విద్యుత్ లైట్లు ఏర్పాటు, తదితర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించామని పేర్కొన్నారు. త్వరలో పనులు ప్రారంభించి, పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి, ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి, డీఈఈ యాదయ్య, ఏఈఈ గుణాకర్, కాశీనాథ్, ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ చింతల అరుణ

నాగోలు: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ సూచించారు. గురువారం నాగోలు డివిజన్ పరిధిలోని అరుణోదయ కాలనీ రోడ్ నెంబర్–6 లో రూ. 16 లక్షల వ్యయంతో చేపట్టిన వరద నీటి కాలువ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. చాలా సంవత్సరాల నుంచి అరుణోదయనగర్ కాలనీలో అపార్ట్‌మెంట్స్ ఇళ్లలోకి వర్షపు నీరు వస్తుందని ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు తన దృష్టికి తీసుకురాగా అధికారులతో చర్చించి పనులు ప్రారంభించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

పుస్తకాల పంపిణీ..

నాగోలు: విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని జైపురి కాలనీ మండల పరిషత్ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఆమె ఉప్పల్ మండల విద్యాధికారి రామారావుతో కలిసి నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో మంచి సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య ఉంటుందని, పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలన్నారు.

జంక్షన్.. టెన్షన్

- డేంజర్‌గా రావిర్యాల ఔటర్ కూడలి
- తరచూ ప్రమాదాలు
- ఆందోళన చెందుతున్న ప్రజలు

తుక్కుగూడ: రావిర్యాల నెహ్రూ ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్– 13 జంక్షన్ డేంజర్‌గా మారింది. ప్రమాదాలకు కేంద్రంగా మారి రక్తసిక్తం అవుతోంది. ప్రయాణికులు, వాహనదారులను భయాందోళనకు గురిచేస్తోంది. ఈ కూడలి.. కలెక్టరేట్, కొంగర్‌కలాన్, రావిర్యాల నుంచి పహాడీషరీఫ్ మీదుగా నగరానికి మన్నెగూడ (నాగార్జున సాగర్ హైవే) హార్డ్‌వేరు పార్క్, ఈ– సిటీ, పర్యాటక కేంద్రం వండర్‌లా, రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం తదితర ప్రాంతాలకు వెళ్లేవారికి అనుసంధానంగా ఉంది. కొంగరకలాన్‌లో ఫ్యాక్స్‌కాన్‌తో పాటు, అనేక నూతన పరిశ్రమలు కొలువుదీరడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.



రావిర్యాల ఔటర్ జంక్షన్

కొరవడిన పర్యవేక్షణ

ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్ విశాలంగా ఉంటుంది. కానీ సూచిక బోర్డులు లేక పోవడంతో వాహనాలు ఇష్టారాజ్యంగా పరుగులు తీస్తుంటాయి. ప్రతి మంగళవారం ఎల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తులు, వండర్‌లాకు వచ్చే పర్యాటకులు, కలెక్టర్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చి వెళ్లేవారితో కూడలి రద్దీగా ఉంటుంది. ఇంత వరకు బాగానే ఉన్నా.. కూడలిలో వేగ నియంత్రణ, కొరవడిన ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ వెరసి నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంటుంది. ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడు నెలల క్రితం టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు, మరో ఘటనలో ఓ పాదచారుడు దుర్మరణం పాలయ్యారు. ఇటీవల ఆర్ఎంసీ కాంక్రీట్ వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు తీవ్రగా గాయపడడంతో పరిసర ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలతో నెత్తురోడుతున్న రోడ్డును చూసి భయాందోళన చెందుతున్నారు. జంక్షన్‌లో వేగ నియంత్రణ చేపట్టాలని, సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు.. ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగించి, ప్రమాదాలకు అడ్డుకట్టవేయాలని కోరుతున్నారు.

ఆషాఢమాస బోనాలు..

సిద్ధమవుతున్న ఆలయాలు

ఏర్పాట్లలో నిర్వాహకులు, కమిటీ ప్రతినిధులు



పోచమ్మ ఆలయంలో కొలువైన అమ్మవారు

మలక్‌పేట: నియోజకవర్గ పరిధిలోని మూసారంబాగ్, సలీంనగర్, అక్బర్‌బాగ్, మలక్‌పేట ప్రాంతాల్లో ఈ నెల 20న జరగనున్న ఆషాఢమాస బోనాల కోసం అమ్మవారి ఆలయాలను ముస్తాబు చేశారు. ఆలయాల ప్రధాన ద్వారం ఆర్చీలు ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. శ్రీపురం కాలనీ నల్లపోచమ్మ దేవాలయం, గడ్డిఅన్నారం పోచమ్మతల్లి దేవాలయం, సాయినగర్ పోచమ్మ ఆలయానికి రద్దీ ఎక్కువగా ఉంటుందని ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన వసతులు కల్పిస్తున్నారు.

◆ మూసారంబాగ్ డివిజన్ ఒకప్పుడు గ్రామం. డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో గతంలో వ్యవసాయ బావులు ఎక్కువగా ఉండటంతో ఈ ప్రాంతాన్ని గచ్చిబౌళిగా పిలిచేవారు. బండి కిష్టయ్య, బండి సాయన్న వ్యవసాయ భూమిలో వెలిసిన పోచమ్మ తల్లిని గ్రామ ప్రజలు గ్రామ దేవతగా కొలిచేవారు. సంవత్సర మొదటి పంటను పోచమ్మకు సమర్పించి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. దాదాపు 78 ఏళ్ల చరిత్ర కలిగినది ఈ దేవాలయం. 1967లో కిష్టయ్య, సాయన్న తమకు ఉన్న 6 ఎకరాల స్థలాన్ని వెంచర్‌గా చేసి ప్లాట్లుగా విక్రయించారు. ఆ వెంచరే ఇప్పుడు సాయినగర్ కాలనీగా వెలిసింది. ఆ సమయంలోనే వారు అమ్మవారి ఆలయాన్ని కూడా నిర్మించారు. అనుకున్న కోరికలు నెరవేరతాయని ఇక్కడి భక్తుల నమ్మకం. ఆనాటి నుంచి అమ్మవారికి ప్రతీ యేడు బోనాల జాతర, సింహవాహిని, బతుకమ్మ పండుగ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు.

బోనాలు ప్రశాంతంగా నిర్వహించాలి

చాదర్‌ఘాట్: ఈ నెల 20న జరిగే బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సౌత్‌ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ శ్రీకాంత్ అన్నారు. గురువారం ఓల్డ్‌మలక్‌పేట పోచమ్మ దేవాలయ కమిటీ ప్రతినిధులు ఆయనను కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్, శివరాజ్, నారాయణరెడ్డి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

27న హయత్‌నగర్ గ్రామంలో

హయత్‌నగర్: హయత్‌నగర్ గ్రామంలో ఈ నెల 27న నిర్వహించనున్న బోనాలకు అన్ని ఏర్పాటు చేసినట్లు డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. బోనాల ఏర్పాట్లపై గురువారం హయత్‌నగర్ ముదిరాజ్ సంఘంలో నిర్వహించిన గ్రామ పెద్దల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ దేవతలైన పోచమ్మ, కట్టమైసమ్మ, ఈదమ్మ, పెద్దమ్మ బోనాలను ఒకే రోజు నిర్వహిస్తామని ఆయా దేవాలయాల కమిటీలు వారికి కావాల్సిన ప్రతిపాదనలు ఇవ్వాలని కోరారు. పోచమ్మ దేవాలయానికి వెళ్లే దారిని బాగు చేయించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు. ఈ సమావేశంలో బాల్‌రాజ్, దర్శన్‌గౌడ్, శ్రీశైలం యాదవ్, శ్రీను, మల్లేష్, రాజు, లింగం సందీప్, రఘునాథ్ సతీష్ పాల్గొన్నారు.



ఆలయ ముస్తాబు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

19 మన్సూరాబాద్‌లో..

మన్సూరాబాద్: ఈ నెల 19 మన్సూరాబాద్‌లోని కంఠమేశ్వరస్వామి బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు మన్సూరాబాద్ గౌడ సహకార సంఘం అధ్యక్షుడు, ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి శ్రీధర్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆలయం బోనాల ఉత్సవాల కరపత్రాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, చింతల అరుణ సరేందర్‌రెడ్డిలతో పాటు పలువురు నాయకులు హాజరవుతారన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్‌గౌడ్, వెంకటస్వామిగౌడ్, నరేష్‌గౌడ్, సాయిదాస్‌గౌడ్, త్రిలోనాథ్‌గౌడ్, సునిల్‌గౌడ్, స్వాత్విక్‌గౌడ్, అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.

డీసీపీకి ఆహ్వానం

చంచల్‌గూడ: ఈ నెల 20న కుర్మగూడ డివిజన్ మాదన్నపేటలో నల్ల పోచమ్మ దేవాలయంలో నిర్వహించే బోనాల జాతకు రావాలని సౌత్‌జోన్ డీసీపీ చైతన్యకుమార్‌కు గురువారం నిర్వాహకులు ఆహ్వానపత్రిక అందజేశారు. గత కొన్ని సంవత్సరాల నుంచి సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ నల్లపోచమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ తంగెళ్ల సుధీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబురావు, నర్సింగ్, విక్కీ, మోహన్, ప్రేమ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నవజీవన్‌రెడ్డి



బోనాల ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్నగౌడ సంఘం నాయకులు



డీసీపీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం